ధార్మిక భవనంలో వేదపాఠశాలకు చోటు దొరకని పక్షంలో వేద పాఠశాల నెలవు కోల్పోయి ప్రత్యామ్నాయ మార్గం లేక చివరకు మూతపడే పరిస్థితి ఏర్పడున్నది. దీంతో ఇందులో చదువుకుంటున్న విద్యార్థులు వీధినపడనున్నారు. వాస్తవానికి ఈ వేద పాఠశాలను ఆలయ ప్రాంగణం నుంచి మరో చోటికి తరలించాలనే ప్రతిపాదన ఎప్పటి నుంచో ఉంది. ప్రస్తుత భవనం ఆలయం కట్టకింద లోతట్టున ఉండడంతో భారీ వర్షాలు వచ్చిన ప్రతీసారి ఇందులోకి వరద నీరు ప్రవేశిస్తోంది. విద్యార్థుల పుస్తకాలు, వస్తువులు తడిసిపోతున్నాయి. వరదనీటి ప్రవాహంతో పాములు భవనంలోకి కొట్టుకువస్తున్నాయి. దీనితో భారీ వర్షాలు పడిన ప్రతీ సారి విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. గత సంవత్సరం జూన్‌లో కురిసిన భారీ వర్షాలకు విద్యార్థులు వరదనీటిలో చిక్కుకుపోయారు. అతికష్టం మీద వారిని బయటకు రప్పించారు. కొద్ది రోజులు పాఠశాల మూతపడింది. కొత్త అడ్మిషన్లలో జాప్యం ఏర్పడింది. ఇటువంటి పరిస్థితుల్లో గోరుచుట్టుపై రోకలి పోటులా మాడవీధుల నిర్మాణం వల్ల ఉన్న భవనం కూడా కోల్పోతుండడంతో వేద పాఠశాల ఉనికే ప్రశ్నార్థకంగా మారింది. దాని నిర్వహణపై నీలినీడలు పరుచుకుంటున్నాయి. ఈ క్రమంలో మాడవీధుల నిర్మాణం తర్వాత అనువైన స్థలంలో స్వంత భవనం నిర్మాణం అయ్యే వరకు తాత్కాలికంగా పాఠశాలను ధార్మిక భవన్‌కు తరలించడం ఒక్కటే మార్గంగా కనిపిస్తున్నది. పాఠశాల నిర్మాహకులు అక్కడి మార్చేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోగా దేవాదాయ శాఖ అధికారులు మోకాలు అడ్డుతుండడంతో తరలింపుపై అనిశ్చిత పరిస్థితి నెలకొన్నది. మంత్రి కొండ సురేఖ, కలెక్టర్ సిక్తాపట్నాయక్ ఈ విషయంలో చొవర తీసుకొని ధార్మిక భవన్‌లోకి వేద పాఠశాల తరలేలా చూడాలని కాకతీయ వారసత్వ పరిరక్షణ కమిటీ కన్వీనర్ చీకటి రాజుతో పాటు పలువురు ధార్మికవేత్తలు, వేదపండితులు కోరుతున్నారు.



కార్యకర్తల కష్టసుఖాలలో పాలుపంచుకుంటా..

మాట్లాడుతున్న అరూరి రమేశ్

- బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేశ్

ధర్మసాగర్, ఏప్రిల్ 8: కార్యకర్తల కష్టసుఖాలలో పాలుపంచుకుంటూ కంటికి రెప్పాలా కాపాడుకుంటామని వరంగల్ పార్లమెంట్ బీజేపీ పార్టీ అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. సోమారం ధర్మసాగర్ మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు చట్లరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్మసాగర్, వేలేరు మండలాల విస్తృత స్థాయి సమావేశానికి ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్, మాజీ మంత్రి విజయరామారావు, మాజీ మేయర్ రాజేశ్వర్‌రావు, మాజీ ఎమ్మెల్యే ధర్మారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా అరూరి రమేశ్ మాట్లాడుతూ పార్టీలో కార్యకర్తల అందరినీ కలుపుకొని పార్టీ కోసం పని చేస్తామన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి మోదీ నాయకత్వంలోని బీజేపీలో చేరానన్నారు. మాజీ మంత్రి విజయ రామారావు మాట్లాడుతూ దేశ భవిష్యత్ యువత చేతుల్లో ఉందని, ప్రధాన మంత్రి చేస్తున్న అభివృద్ధిని ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. మాజీ మేయర్ రాజేశ్వర్‌రావు మాట్లాడుతూబీజేపీ 400సీట్లు గెలిచే అవకాశం ఉందన్నారు. కడియం శ్రీహరి బిడ్డ కోసం నీతిమాలిన రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే ధర్మారావు మాట్లాడుతూ పేదవాడికి న్యాయం చేసే పార్టీ బీజేపీ అని అన్నారు. ఎంపీ అభ్యర్థి రమేశ్‌ను లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఆనంతరం తాటికాయల గ్రామానికి చెందిన యువకులు అరూరి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో రాష్ర్ట నాయకులు విజయరావు, జిల్లా నాయకులు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో వృద్ధురాలి మృతి



బొమ్మగాని నిర్మల (ఫైల్)

జనగామ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వడదెబ్బతో వృద్ధురాలు మృతిచెందిన సంఘటన జనగామ జిల్లాకేంద్రంలో సోమవారం జరిగింది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జిల్లాకేంద్రంలోని సంజయ్‌నగర్‌కు చెందిన బొమ్మగాని నిర్మల (65) స్థానికంగా ఓ హోటల్‌లో పనిచేస్తోంది. ఇంటి నుంచి హోటల్‌కు రోజు నడుచుకుంటూ వెళ్లి వచ్చేది. ఈ క్రమంలో రెండు క్రితం హోటల్ నుంచి ఇంటికి ఎండలో నడుకుంటూ రాగా అస్వస్థతకు గురైంది. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స చేయించారు. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి పరిస్థితి విషమించడంతో స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందింది. మృతురాలి కుమారుడు శ్రీకాంత్‌గౌడ్ ఓ దిన పత్రికలో రిపోర్టరుగా పనిచేస్తున్నాడు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పలువురి పరామర్శ

వడదెబ్బతో మృతిచెందిన నిర్మల కుమారుడు శ్రీకాంత్‌గౌడ్‌ను కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఎంతో పాటు పలు పార్టీల నాయకులు, జర్నలిస్టులు పరామర్శించారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మృతదేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా కాంగ్రెస్ నేతలు చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, మేడ శ్రీనివాస్, చెంచారపు బుచ్చిరెడ్డి, కౌన్సిలర్లు రాంచందర్, జక్కుల అనిత, సీపీఎం భువనగిరి అభ్యర్థి ఎండి.జహంగీర్, సీపీఎం నేతలు బూడిద గోపి, జోగు ప్రకాశ్ తదితరులు పరామర్శించారు. శ్రీకాంత్‌గౌడ్‌కు మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య ఫోన్ ద్వారా సంతాపం తెలిపారు. శ్రీకాంత్‌గౌడ్ ఆర్థిక పరిస్థితి బాగాలేకపోవడంతో జనగామ జర్నలిస్టులు, పలువురు నేతలు ఆర్థికసాయం అందించారు.

నేటినుంచి భద్రకాళి ఆలయంలో నవరాత్రి మహోత్సవాలు

వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 8 : వరంగల్ నగరంలోని భద్రకాళి అమ్మవారి దేవస్థానంలో వసంత నవరాత్రి మహోత్సవాలు నేటి నుంచి 17వ తేది వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి శేషుభారతి ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీక్రోధి నామ సంవత్సరం ఉగాది రోజున మంగళవారం అమ్మవారికి పూర్ణాభిషేకం నిర్వహించడంతో నవరాత్రి రథం ప్రారంభమవుతుందన్నారు. చైత్ర శుద్ధ పాడ్యమి రోజున బ్రహ్మ తన సృష్టిని పూర్తి చేశాడని శ్రీభద్రకాళి అమ్మవారే బ్రహ్మ స్వరూపమని వసంత నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారిని పూజిస్తే అన్ని శుభాలు కలుగుతాయని తెలిపారు.

ఎంజీఎంలో రేడియాలజీ విభాగంలో ఆగిన సేవలు

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 8 : వరంగల్ ఎంజీఎం హాస్పిటల్‌లో సోమవారం డిజిటల్ ఎక్స్‌రే మిషన్ పని చేయక రోగులు ఇబ్బంది పడ్డారు. ఆస్పత్రి రేడియాలజీ డిపార్ట్‌మెంట్‌లో ఉన్న ఎక్స్‌రే మిషన్‌లో డిజిటల్ ఎక్స్‌రే మిషన్ ఒకటి మాత్రమే గత కొన్ని సంవత్సరాలుగా పని చేస్తోంది. మరో రెండు మిషన్లు ఉన్నా అవి మొబైల్ ఎక్సరే కావడంతో సేవలు అంతంత మాత్రంగానే పని చేస్తున్నాయి. సోమవారం ఓపీ, ఐపీ రోగులు అధికంగా రావడంతో ఎక్స్‌రే మిషన్లు పని చేయక ఇబ్బంది పడ్డారు. చివరకు మొబైల్ ఏక్సేంజ్ మిషన్‌పై ఎమర్జెన్సీ రోగులకు ఎక్సరేలు తీశారు. పనిచేయని డిజిటల్ ఎక్సరే మిషన్‌ను రిపేర్ చేయిస్తామని అధికారులు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

వరంగల్ క్రైం, ఏప్రిల్ 8: హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని పరిసరాల్లో రూ.13 లక్షల విలువైన పీడీఎస్ బియ్యాన్ని రాష్ర్ట ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. స్టేషన్ పరిధిలో పెద్దఎత్తున పీడీఎస్ రైస్ దందా నడుస్తుందనే సమాచారంతో ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం నిఘా వేసి బియ్యం తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకున్నారు. వరంగల్ నగరానికి చెందిన జన్ను అనిల్ అనే వ్యక్తి వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో పీడీఎస్ రైస్ సేకరించి లారీలో మహారాష్ట్రకు తరలించేందుకు యత్నిస్తున్న క్రమంలో పట్టుకున్నారు. 680 బ్యాగులతో కూడిన లారీని స్టేషన్‌కు తరలించి డ్రైవర్ సునిల్‌ను, అక్రమ దందా చేస్తున్న అనిల్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఈ విషయన్ని హసన్‌పర్తి పోలీసులు ధృవీకరించారు.

అత్యాశకు పోయి డబ్బులు పోగొట్టుకున్న వ్యక్తి

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 8 : వాట్సాప్ లింకు ఓపెన్ ద్వారా వచ్చే డబ్బులకు ఆశపడి ఓ వ్యక్తి డబ్బులు పోగొట్టుకున్నాడు. వివరాల్లోకి వెళితే.. రాయపురకు చెందిన మహ్మద్ ఇబ్రహీం ఓ వాట్సాప్ గ్రూప్‌లో వచ్చిన లింక్‌ను ఓపెన్ చేయగా టెలిగ్రామ్ ఐడికి కనెక్ట్ అయ్యాడు. అటు నుంచి గుర్తుతెలియని వ్యక్తి కంపెనీ మేనేజర్‌గా చాట్ చేసి ట్రేడింగ్ ద్వారా డబ్బులను డబుల్ చేసుకోవచ్చని ఆశ కల్పించాడు. వారిచ్చిన ఐడికి మూడు దశలో 7,000 ట్రాన్స్‌ఫర్ చేయగా తిరిగి 8,327 రూపాయలు ఇబ్రహీంకు ట్రాన్స్‌ఫర్ చేశారు. తర్వాత ఇన్వెస్ట్ చేయమని చాట్ చేయగా 5,000 ట్రాన్స్‌ఫర్ చేశాడు. ఇంకొక 30,000 చేస్తే విత్ డ్రా ఆప్షన్ వస్తుందని చెప్పగా 30,000 ట్రాన్స్‌ఫర్ చేశాడు. అయినా విత్ డ్రా ఆప్షన్ రాకుండా మరోక సారి డబ్బులు ఇన్వెస్ట్ చేయాలని అడగడంతో మోసపోయినని గ్రహించిన బాధితుడు హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పున్నేలులో మద్యం పట్టివేత

ఐనవోలు, ఏప్రిల్ 8 : అనుమతులు లేకుండా విక్రయిస్తున్న మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై అనిల్ కుమార్ కథనం ప్రకారం పున్నేలు గ్రామంలో రావుల రాజు అనే వ్యక్తి తన ఇంట్లో మద్యం నిల్వచేసి విక్రయిస్తుండగా తనిఖీలు నిర్వహించి రూ.7821 వేల మద్యాన్ని స్వాధీనం చేసుకొని ఆయనపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అందరికీ విద్య ప్రభుత్వ బాధ్యత

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఉన్నత విద్యకు దూరం
- వర్సిటీలకు యూజీసీ నిధులు తగ్గాయి..
- ప్రముఖ సామాజిక వేత్త, ప్రొఫెసర్ హరగోపాల్
- కేయూలో ఉన్నత విద్యపై సింపోజియం

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 8 : అందరికీ విద్య ప్రభుత్వ బాధ్యతని ప్రముఖ సామాజిక వేత్త, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం రిటైర్డు ప్రొఫెసర్ జి.హరగోపాల్ అన్నారు. సోమవారం కేయూ సెనెట్ హాల్‌లో కేయూ రిటైర్డు ప్రొఫెసర్ల సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎ.సదానంద అధ్యక్షతన సింపోజియం నిర్వహించారు. 'తెలంగాణలో ఉన్నత విద్య ప్రస్తుత పరిస్థితులు-బలోపేతం చేయడానికి అనుసరించాల్సిన విధానాలు' అనే అంశంపై హరగోపాల్ మాట్లాడారు. ప్రభుత్వాలు మారినప్పటికీ విద్యకు బడ్జెట్‌లో నిధులు పెంచడం లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలు ఉన్నత విద్యకు దూరం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. యూజీసీ నిధులు బాగా తగ్గించారని చెప్పారు. పరిశోధన ప్రాజెక్టులు నిధుల లేమితో ఇబ్బందులు పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్య ప్రైవేట్, వాణిజ్యపరం కావడంతో తరువాతి తరం వారు సేవ దృక్పథాన్ని మరిచి వాణిజ్య పరంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రపంచ బ్యాంకు నిబంధనల మేరకు విద్య ప్రైవేట్ పరం అవుతోందని హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. గత కొన్నేళ్ళుగా విద్య రంగంపై ప్రభుత్వాలు నియమించిన కమిటీలు వాటి సిఫార్సులను వివరించారు. ప్రపంచంలో నిరంతరం ఎదురవుతున్న పోటీలకు దీటుగా ప్రభుత్వ విద్య సంస్థలుండాలని అన్నారు.

రాష్ట్రంలో విద్య రంగంలో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియోలో ప్రగతి ఉందని రాష్ర్ట ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి అన్నారు. రాష్ట్రంలోని 99 డిగ్రీ కళాశాలలు న్యాక్ గ్రేడింగ్ పొందాయని చెప్పారు. దేశంలో బెస్ట్ ప్రాక్టీస్‌గా దోస్త్ అడ్మిషన్ల ప్రక్రియ నిలుస్తోందని చెప్పారు. అన్ని కళాశాలల్లో రూల్స్ ఆఫ్ రిజర్వేషన్లు ఖచ్చితంగా అమలవుతున్నాయని చెప్పారు. విద్య లక్ష్యం విద్యార్థి వికాసం, ఉపాధి, ఆత్మ విశ్వాసం కావాలని కోరారు. కాకతీయ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి విద్య రంగ పురోగతికి ప్రభుత్వాలు చాలా కమిటీలను ఏర్పాటు చేసినప్పటికీ స్పష్టత రాలేదని వివరించారు. 75 ఏళ్ళ భారతంలో గుణాత్మక విద్య అందించలేకపోతున్నామని అవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో నిధుల కేటాయింపు తక్కువగా ఉందన్నారు. వర్సిటీలు క్రాస్ రోడ్డులో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. యూజీసీ రిటైర్డు చైర్మన్ సుఖదేవ్ థోరట్ జూమ్ వెబ్‌సైట్‌లో సమావేశంలో మాట్లాడారు. యూజీసీ బడ్జెట్ కోత ఉందని చెప్పారు. ప్రభుత్వం పరిశోధనలకు, ప్రాజెక్టులకు నిధులు ఇవ్వడం లేదన్నారు. తెలంగాణ అకాడమి ఆఫ్ సైన్స్ అధ్యక్షుడు డాక్టర్ సీహెచ్. మోహన్‌రావు మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయాలు స్టూడెంట్స్ కేంద్రంగా ఉండాలని అన్నారు. జీడీపీలో విద్య రంగానికి పెద్ద మొత్తంలో నిధులు కేటాయించాలని అన్నారు. సమావేశంలో విశ్రాంత ప్రొఫెసర్ల సంఘం జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ వడ్డె రవీందర్, ఎస్డీఎల్‌సీఈ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ జి.వీరన్ననాయక్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, హైయర్ ఎడ్యుకేషన్ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ టి.పాపిరెడ్డి, ప్రొఫెసర్ కూరపాటి వెంకట్‌నారాయణ, ప్రొఫెసర్ ఇక్బాల్ అలీ, ప్రొఫెసర్ తాటం శ్రీనివాస్, ప్రొఫెసర్ గాదె దయాకర్, ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామి, చింత సమ్మయ్య, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, కృష్ణమాచారి, సంజీవరెడ్డి, సాయులు, దీపాజ్యోతి, రామస్వామి, ఇంద్రాసేనారెడ్డి, రామిరెడ్డి, కట్ల రాజేందర్, ప్రొఫెసర్ కె.కాత్యాయని విద్మహే, రాంనాథ్‌కిషన్, సక్రియా, ప్రొఫెసర్ శోభ, ఎఆర్ పెండ్లి అశోక్‌బాబు పాల్గొన్నారు.

16న 'స్వీప్' ఆధ్వర్యంలో 5కే రన్



మాట్లాడుతున్న ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 8 : ఓటు హక్కు కలిగిన ఓటర్లు ఎన్నికల్లో ఓటు వేసే విధంగా చైతన్యవంతం చేసేలా స్వీప్ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన 5కే రన్ నిర్వహించనున్నట్లు ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా తెలిపారు కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో 5కే రన్ కార్యక్రమ నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా మాట్లాడుతూ 16న ఉదయం 6 గంటలకు హనుమకొండలోని జేఎన్ఎస్ స్టేడియం నుండి రన్ ప్రారంభమై హనుమకొండ కలెక్టరేట్ వరకు కొనసాగుతుందన్నారు. ఈ పరుగులో విద్యార్థులు, యువత, అధికారులు, ఉద్యోగులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. 5కే రన్ విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్వీప్ నోడల్ ఆఫీసర్ లక్ష్మీ రమాకాంత్, జిల్లా సంక్షేమ అధికారి మధురిమ, గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ కాజీపేట డిప్యూటీ కమిషనర్ రవీందర్, జిల్లా యువజన, క్రీడల అధికారి అశోక్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా

18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా అన్నారు. హనుమకొండలోని కాకతీయ డిగ్రీ కళాశాలలో సోమవారం కొత్త ఓటర్ల నమోదు, ఓటింగ్ శాతాన్ని పెంచడంపై విద్యార్థులకు స్వీప్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా మాట్లాడుతూ ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు తప్పకుండా వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్ శ్రద్దా శుక్లా, స్వీప్ నోడల్ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీరమాకాంత్, కేడీసీ ప్రిన్సిపాల్ రాజిరెడ్డి, డీఎల్‌పీవో సుదర్శన్, ఎంపీవో రవిబాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ వినోద్‌రావు పాల్గొన్నారు.

గంజాయి రవాణాను అరికట్టాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో మల్టీజోన్-1 ఐజీ రంగనాథ్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎస్పీ శబరీశ్, అధికారులు

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 8: ములుగులో జిల్లాలో గంజాయి రవాణాను అరికట్టాలని మల్టీజోన్-1 ఐజీ ఎ.వి.రంగనాథ్ అన్నారు. ఎన్‌డీపీఎస్‌పై ములుగులోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ శబరీశ్, జిల్లా పోలీస్ అధికారులతో ఐజీ సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్‌డీపీఎస్ కేసుల నమోదు, డ్రగ్స్ సరఫరా నిలుపుదలకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో యాంటీ డ్రగ్స్ కమిటీ ఏర్పాటుచేసి ఇప్పటికే 757.625 కిలోల గంజాయిని పట్టుకుని ధ్వంసం చేశామని, తెలిపారు. ఇటీవల మరిన్ని కేసులు నమోదు చేశామని అన్నారు. గంజాయి సరఫరాను అడ్డుకునే లక్ష్యంగా అంతర్రాష్ట్ర, జిల్లా రహదారుల వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదివాసీలకు గంజాయి వాడకం పట్ల కలిగే దుష్పలితాలను వివరిస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఐజీకి వివరించారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో ఏటూరునాగారం ఏఎస్పీ గీతే మహేష్ బాబాసాహెబ్, ములుగు డీఎస్పీ రవీందర్, డీసీఆర్బీ డీఎస్పీ రాములు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, ములుగు, ఏటూరునాగారం, పస్రా సీఐలు రంజిత్‌కుమార్, రాజు, శంకర్, సీసీఎస్ సీఐ శ్రీనివాస్, ఎస్సైలు వెంకటేశ్వర్, రాజు, కమలాకర్, కృష్ణప్రసాద్, రవికుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

శిక్షణ శిబిరాలకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్ 8: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) ఆధ్వర్యంలో మే 1 నుంచి 31 వరకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నిర్వహించనున్న వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవడానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీవైఎస్‌వో అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నెల రోజుల పాటు ఉచితంగా నిర్వహించనున్న వేసవి శిక్షణ శిబిరంలో 4వ తరగతి నుంచి ఇంటర్ చదువుతున్న బాలబాలికలు పాల్గొనవచ్చన్నారు. ఈ శిబిరాల్లో శిక్షణ ఇచ్చేందుకు అనుభవజ్ఞులైన సీనియర్ క్రీడాకారులు, పీడీలు, పీఈటీలు ఈ నెల 25వ తేదీ వరకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఇండోర్ స్టేడియంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. హనుమకొండ జేఎన్ఎస్‌లో వివిధ క్రీడా అంశాల్లో నిర్వహించనున్న వేసవి శిక్షణ శిబిరంలో పే అండ్ ప్లే పద్ధతిన ప్రతీ రోజు ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని అశోక్ సూచించారు.

పెళ్లింట విషాదం.. విద్యుదాఘాతంతో రైతు మృతి



చందర్ (ఫైల్)

ఖానాపురం, ఏప్రిల్ 8 : పెళ్లింట విషాదం నెలకొంది.. ఈనెల 24న కుమారుడి వివాహం కోసం ఏర్పాట్లు చేస్తుండగా.. విద్యుదాఘాతంతో సోమవారం రైతు మృత్యువాత పడడంతో ఖానాపురం మండలం కొడ్తిమాట్‌తండాలో విషాదం నెలకొంది. పోలీసుల కథనం ప్రకారం..

కొడ్తిమాట్‌తండాలకు చెందిన బానోతు చందర్(52)కు భార్య ఇద్దరు కుమారులున్నారు. కాగా, తనకున్న రెండున్నర ఎకరాల్లో మొక్కజొన్న, అపరాల సాగు చేస్తున్నాడు. పంటకు తన వ్యవసాయ బావి నీరు సరిపోకపోవడంతో సమీపంలో ఉన్న తన చిన్నాన్న(సమీప బంధువు) బావి నుంచి కొన్ని రోజులుగా నీటిని వాడుకుంటున్నాడు. రోజులాగే మోటార్ స్టాటర్‌ను ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందాడు. కాసేపటికి సమీపంలోని రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడి భార్య హచ్చమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ రమేష్ తెలిపారు. చందర్ చిన్నకుమారుడు శివకు ఈనెల 24 వివాహం చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. బట్టలు, బంగారం కొనుగోలు చేశారు. పెండ్లి పనుల్లో ఉండగానే చందర్ మృతి చెందడంతో పెళ్లింట్లో విషాదం నెలకొంది.

బైక్ అదుపు తప్పి ఒకరి మృతి



శివ (ఫైల్)

చిట్యాల, ఏప్రిల్ 8: ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరు మృతిచెందిన సంఘటన చిట్యాల మండలం ముచినిపర్తి శివారు వెంకటేశ్వర్లపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రేగొండ మండలం కొడవటంచ గ్రామానికి చెందిన నాగుల శివ (26) వ్యక్తిగత పని నిమిత్తం గణపురం మండలం కర్కపల్లికి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఈక్రమంలో వెంకటేశ్వర్లపల్లి గ్రామ శివారులో ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడిపోయాడు. తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘన స్థలాన్ని ఎస్సై-2 షాఖాన్ సందర్శించి వివరాలు సేకరించారు. మృతుడికి భార్య లావణ్య, మూడు సంవత్సరాల కుమారుడు ఉన్నాడు.

పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య



మృతురాలు నాగమణి

నర్మెట, ఏప్రిల్ 8 : పురుగుల మందు తాగి ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం మండలంలోని లోక్యతండా గ్రామ పంచాయతీ పరిధిలోని హన్మచంద్రుతండాలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం హన్మచంద్రుతండాకు చెందిన బానోతు వేణు నాగమణి(21) భార్యభర్తలకు గత కొద్ది రోజులుగా గొడవ జరుగుతోంది. ఈ క్రమంలో సోమవారం గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన నాగమణి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఎక్కువ మోతాదులో తాగడంతో ఇంట్లోనే మృతి చెందింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు. నాగమణి మృతిపై బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నాగమణి మృతికి భర్త వేణు వేధింపులే కారణమని, కొట్టి చంపి ఉంటాడని మృతురాలు బంధువులు ఆరోపిస్తున్నారు. మృతురాలికి మూడు నెలల చిన్న బాబు ఉన్నాడు. భర్త వేణుపై చర్యలు తీసుకోవాలని జనగామ ఏరియా ఆస్పత్రి ఎదుట మృతురాలు బంధువులు గొడవ చేసినట్లు సమాచారం. ఈ విషయమై ఎస్సై కన్నెబోయిన శ్రీకాంత్‌ను వివరణ అడుగగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఐస్‌క్రీంలో ఎలాంటి వ్యర్థ పదార్థాలు కలుపలేదు

- జిల్లా సహాయ ఆహార నియంత్రణాధికారి

నెక్కొండ, ఏప్రిల్ 8 : నెక్కొండలోని అంబేద్కర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఐస్‌క్రీం బండిలో వ్యర్థ పదార్థాలు (మూత్రం, వీర్యం) కలిపి అమ్ముతున్నట్లు సోషల్ మీడియాలో జరిగిన ప్రచారం అవాస్తవమని జిల్లా సహాయ ఆహార నియంత్రణాధికారి పి.అమృతశ్రీ సోమవారం రాత్రి తెలిపారు. ఐస్‌క్రీంలో వ్యర్థ పదార్థాలను కలిపి అమ్ముతున్న విషయమై జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఆదేశాల మేరకు మార్చి 19న బండి యజమాని కాలురాంపై పోలీసు కేసు నమోదు చేయడంతో పాటు అతను విక్రయించిన ఐస్‌క్రీం సంబంధించి నాలుగు నమూనాలను సేకరించి రాష్ర్ట ఆహార ప్రయోగశాల హైదరాబాద్‌కు పరీక్షల నిమిత్తం పంపించామన్నారు. కానీ ఐస్‌క్రీం పదార్థాలో (మనిషికి సంబంధించి మూత్రం, వీర్యం) ఎలాంటి వ్యర్థాలు కలువలేదని ల్యాబ్ అధికారులు తెల్పినట్లు చెప్పారు. సామాజిక మాధ్యమంలో వచ్చే వీడియోలను సరైన పద్ధతిలో నిర్ధారించుకొని, ఆహార అధీకృత అధికారుల తనిఖీల తర్వాత ప్రజలు నమ్మాలన్నారు.

హేమాచలుడిని దర్శించుకున్న సీసీఎఫ్



సీసీఎఫ్‌కు స్వాగతం పలుకుతున్న అర్చకులు

మంగపేట, ఏప్రిల్, 8: మండలంలోని మల్లూరు హేమాచల లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని కాళేశ్వరం చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (సీసీఎఫ్) ప్రభాకర్ సోమవారం దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు రాజశేఖరశర్మ, రాఘవాచార్యులు, ఈశ్వర్‌చంద్ శర్మ స్వాగతం పలికారు. గోత్రనామాలతో అర్చనలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్వామివారి శేషవస్త్రాలతో సత్కరించారు.సీసీఎఫ్ వెంట తాడ్వాయి ఎఫ్ఆర్వో సత్తయ్య, మంగపేట డిప్యూటీ రెంజర్ కోటేశ్వర్, ఇతర ఫారెస్ట్ ఉద్యోగులు ఉన్నారు.

గురుకుల విద్యార్థులకు కంటి పరీక్షలు



విద్యార్థులకు కంటిపరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

జనగామ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నామని జిల్లా వైద్యాధికారి హరీశ్‌రాజ్ తెలిపారు. జిల్లాకేంద్రంలోని ఎస్సీ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు సోమవారం కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని 16 పాఠశాలలో 3816 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలోని రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం బృందాలు, కంటి పరీక్ష బృందాల సిబ్బందితో కలిపి 3 టీములను ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో బృందం రోజుకు 250 మంది విద్యార్థుల చొప్పున 5 రోజుల పాటు కంటి పరీక్షలు కొనసాగుతాయని తెలిపారు. పరీక్షల్లో దృష్టి లోపం ఉన్నవారిని గుర్తించి మెరుగైన కంటి వైద్యం అందిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ మహేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం : అరూరి

రఘునాథపల్లి, ఏప్రిల్ 8 : ముచ్చటగా మూడోసారి నరేంద్ర మోదీ ప్రధాన మంత్రి కావాలనే సంకల్పంతో కార్యకర్తలు అంకిత భావంతో కృషి చేయాలని , బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని వరంగల్ ఎంపీ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండలంలోని నిడిగొండ గ్రామ పంచాయతీ పరిధిలోగల ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో సోమవారం జరిగిన రఘునాథపల్లి, లింగాలఘణపురం మండలాల బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి జిల్లా పార్టీ అధ్యక్షుడు అరుట్ల దశమంతరెడ్డి అధ్యక్షత వహించారు. సమావేశానికి మాజీ ఎమ్మెల్యేలు ధర్మారావు, రాజేశ్వర రావు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండె విజయరామ రావు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా అరూరి రమేష్ మాట్లాడుతూ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని, ఏ రాజకీయ పార్టీ అయిన విజయపథంలో పయ నించాలంటే కార్యకర్తల సమిష్టి కృషి అవసరమని, నేను కుడా కార్యకర్త స్థాయి నుంచే రెండు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయి ఇప్పుడు బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థిగా ఎంపిక కావడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు బొజ్జపల్లి సుభాష్, మండల పార్టీ అధ్యక్షుడు పుప్పాల వేణుకుమార్, వల్లాల ఉపేందర్, కల్వగూరి ప్రభాకర్, మంద వెంకటేషం, కావటి ముత్యాలు, వెంకట రెడ్డి, సంపత్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

● స్టేషన్‌ఘన్‌పూర్ : త్వరలో జరగనున్న వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఆదరిస్తే, ఉమ్మడి వరంగల్ జిల్లాను అగ్రగామిగా నిలుపుతా నని ఆ పార్టీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి ఆరూరి రమేష్ అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో, జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన మూడు మండలాల (స్టేషన్‌ఘన్‌పూర్, చిలుపూర్, జఫర్‌గఢ్) విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడారు. గడిచిన పదేళ్ళుగా దేశంలో ప్రధాని మోదీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్ళి వివరించాలని కార్యకర్తలను కోరారు. స్వార్థప్రయోజనాలే లక్ష్యంగా రాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్యతో పాటు, ఎమ్మెల్యే కడియం శ్రీహరి వ్యూహాలను తిప్పికొట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో తనను ఆదరిస్తే టెక్స్‌టైల్ పార్క్, కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, విద్యుత్ ప్రాజెక్ట్‌లను నెలకొల్పడంతో పాటు, నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తానని హామీ ఇచ్చారు. బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. అనంతరం ఆయా గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో అభ్యర్థి రమేష్ సమక్షంలో బీజేపీలో చేరగా, వారికి ఆయన కాషాయ కండువాలను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు మార్తినేని ధర్మారావు, డాక్టర్ గుండె విజయరామారావు, వరంగల్ మాజీ మేయర్ రాజేశ్వర్ రావు, డాక్టర్ బొజ్జపల్లి సుభాష్, చిలుక విజయరావు, శివరాజ్‌యాదవ్, ఇనుగాల యుగంధర్‌రెడ్డి, తోకల సంపత్‌రెడ్డి, గంటె ఉపేందర్ యాదవ్, గట్టు క్రిష్ణ, అంజిరెడ్డి, తోట శ్రీనివాస్, బాల్నె శ్రీనివాస్, ఎలిశాల శ్రీనివాస్, సాదం రామరాజు, దోరం శ్రీనివాస్, సాదం భీమన్న, కాదుకాయ రమేష్, కందుకూరి రజనీకర్, సామల రాము తదితరులు పాల్గొన్నారు.



నిడిగొండలో జరిగిన బీజేపీ రెండు మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్

ఉచిత శిక్షణకు గడువు పొడిగింపు

జనగామ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మైనారిటీ శాఖ ఆధ్వర్యంలో మైనారిటీ నిరుద్యోగ యువతకు నిర్వహించే ఉచిత శిక్షణకు దరఖాస్తు గడువును పొడిగించినట్లు జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూపీఎస్సీ సీశాట్ పరీక్ష కోసం మైనారిటీ యువతకు హైదరాబాద్‌లోని మైనారిటీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల యువత ఏప్రిల్ 22 లోగా ఐఎంఆర్ఈఐఎస్‌తెలంగాణ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 28న ఉంటుందన్నారు. తల్లితండ్రుల వార్షిక ఆదాయం రూ. 5 లక్షల లోపు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు.

ఈ నెల 12న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

జనగామ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12న జిల్లాకేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు జరుగుతాయని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెద్ది వెంకటనారాయణగౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14, అండర్-16, అండర్-18, అండర్-20 ఎంపికలు జరుగుతాయన్నారు. వివరాలకు 98850 46437(గంగిశెట్టి మనోజ్‌కుమార్), 99124 53220(ఆవుల అశోక్), 77995 52233(వంచ చంద్రశేఖర్‌రెడ్డి) నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నేడు ఉగాది పంచాంగ శ్రవణం

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, ఏప్రిల్ 8: తెలుగు వారి నూతన సంవత్సరాది ఉగాది పర్వదినం పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం స్టేషన్ ఘన్‌పూర్, శివునిపల్లి పట్టణాల్లో పంచాంగ శ్రవణం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీల బాధ్యులు తెలిపారు. తిరుమల నాథస్వామి దేవాలయం, వేంకటేశ్వరాలయంలో సాయంత్రం 6 గంటలకు వేద పండితులతో క్రోధి నామ సంవత్సర పంచాంగ శ్రవణం ఏర్పాటు చేశారు. అనంతరం తిరుమల నాథ స్వామి దేవాలయంలో శ్రీ రామ నవమి కళ్యాణ శుభ లేఖలు ఆవిష్కరిస్తారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

తెలంగాణ మాల పోరాట సమితి కమిటీలు రద్దు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, ఏప్రిల్ 8: తెలంగాణ మాల పోరాట సమితికి నూతన కమిటీల ఏర్పాటు కోసం పాత కమిటీలన్నింటిని రద్దు చేస్తున్నట్టు ఉత్తర్వులు జారీ చేశామని సమితి రాష్ట్ర వ్యవస్థాపకుడు పి. వెంకటేశ్వర్లు తెలిపారు. స్టేషన్ ఘన్‌పూర్‌లో విలేకరులతో సోమవారం మాట్లాడారు. సమితిని 2010లో ఏర్పాటు చేశామని, ప్రతి రెండేళ్లకు ఒకసారి కమిటీలను నూతనంగా ఎన్నుకుంటున్నామన్నారు. దీనిలో భాగంగా పాత కమిటీలను బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు త్వరలో నూతనంగా ఏర్పాటు చేస్తామన్నారు. కమిటీల ఏర్పాటుకు సమితి కార్యకర్తలు, నాయకులు కలిసి రావాలన్నారు. అప్పటి వరకు వ్యవస్థాపక అధ్యక్షుడికి తెలియకుండా ఎవరూ ఎలాంటి ప్రకటనలు పత్రికలు, మీడియా, సోషల్ మీడియాలో చేయరాదన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని 10 ఉమ్మడి జిల్లాలకు ఇన్‌చార్జీలను నియమించామన్నారు. ఆదిలాబాద్ జిల్లా అంకేశ్వరపు రమేశ్, నిజామాబాద్ శ్రీరాముల పైడి, కరీంనగర్ భోగం నర్సయ్య, మెదక్ దాసరి రాజు, వరంగల్ మేడిపల్లి రాణి, ఖమ్మం దేవ కరుణ, నల్లగొండ జి.రమేశ్, హైదరాబాద్ తరాల శంకర్, రంగారెడ్డి అర్ల శంకర్, మహబూబ్ నగర్ ఎం.నర్సింహ స్వామి ఇన్‌చార్జీలుగా ఉంటారని పేర్కొన్నారు.

కార్మికుడి మృతికి కారణమైన వారిపై తీసుకోవాలి

జనగామ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పాలకుర్తిలో విద్యుత్ షాక్‌తో మృతి చెందిన విద్యుత్ కార్మికుడు బైకాని శ్రీశైలం మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాపర్తి రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు జనగామలోని ఎస్ఈ కార్యాలయంలో ఏడీఈ ప్రభావతి సోమవారం వినతిపత్రం అందించారు. ఎల్‌సీ తీసుకోవడంలో సంబంధిత ఏఈ రణధీర్ నిబంధనలను పాటించకపోవడం వల్లే శ్రీశైలం మృతిచెందాడని అన్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌పై బ్రేక్‌డౌన్ సమస్య పరిష్కారం కోసం ఏఈ రణధీర్ శ్రీశైలం ఒక్కడినే పంపాడని, ఇది నిబంధనలకు విరుద్ధమన్నారు. వెంటనే ఏఈని సస్పెండ్ చేసి కార్మికుడి కుటుంబానికి రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా, అతని భార్యకు విద్యుత్ సంస్థలో ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందించిన వారిలో నాయకులు తాండ్ర ఆనందం, గంగరబోయిన మల్లేశ్‌రాజ్ తదితరులు ఉన్నారు.

మృతుడి భార్యకు ఉద్యోగం ఇవ్వాలి

పాలకుర్తి, ఏప్రిల్ 8 : మండలంలోని తీగారం గ్రామానికి చెందిన బైకాని శ్రీశైలం ప్రమాదావ శాత్తు విద్యుదాఘాతం మృతి చెందగా కుటుంబంలో ఆయన భార్యకు ఉద్యోగం ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి మాచెర్ల సారయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ స్మారక భవనంలో ఆ శాఖ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో అత్యవసర సమావేశం నిర్వహిచారు. నాయకులు సోమ అశోక్ బాబు, బెల్లి సంపత్, కత్తుల సోమన్న, లక్ష్మన్, నార్లపురం పర్శరాములు, సతీష్, మిట్టపల్లి సతీష్ తదితరులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

పాలకుర్తి, ఏప్రిల్ 8 : మండలంలోని తీగారం గ్రామానికి చెందిన విద్యుత్ శాఖలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి బైకాని శ్రీశైలం ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెదంగా, సోమవారం స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి గ్రామాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాంగ్రెస్ నాయకులు రాపాక సత్యనారాయణ, మాజీ సర్పంచు పోగు శ్రీనివాస్, రాజేశ్వరీ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

తరిగొప్పుల, ఏప్రిల్ 8: మండల కేంద్రానికి చెందిన గీత కార్మికుడు తాళ్లపల్లి బక్కయ్య(55) ఇటీవల ప్రమాదవశత్తు తాటి చెట్టుపై నుంచి కిందపడి మృతి చెందగా బాధిత కుటుంబాన్ని సోమవారం 2010-2011 పదో తరగతి పూర్వ విద్యార్థులు పరామర్శించి రూ. 10100 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ తాళ్లపల్లి బక్కయ్య చిన్న కూతురు అంజలి తమతో కలిసి చదువుకున్నందున వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక చేయూతనిచ్చేందుకు ముందుకు వచ్చామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మామిడా స్వప్న, గాలి కవిత, ఎనమల్ల సృజన్, ఎర్రవెల్లి సాగర్, దామెర దివ్య, గాడి రాజు, జాగీరు భవాని పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న ఒకరి మృతి


చిలుపూర్, ఏప్రిల్ 8 : ప్రమాదవశాత్తు జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. సోమవారం ఎస్సై ముత్యం రాజేందర్ తెలిపిన వివరాల మేరకు.. రంగారెడ్డి జిల్లా తాళ్లకొండపల్లి మండలంలోని జూలపల్లి శివారు చుక్కతండాకు చెందిన సభావత్ మల్లేష్ (22)కు ఇటీవలే వివాహమైంది. తన భార్య నర్సంపేటలోని తల్లిగారింట్లో ఉండడంతో ఈ నెల 5న అతడు హైదరాబాద్ నుంచి అత్తగారింటికి బైక్‌పై బయలుదేరాడు. కాగా, మండలంలోని చిన్నపెండ్యాల సమీపంలోని ఆకేరువాగు బ్రిడ్జి సమీపంలో హైవేపై ఒక్కసారిగా బైక్ అదుపు తప్పడంతో కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడ్డ అతడిని స్థానికుల సమాచారంతో పోలీసులు అతడిని చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న మల్లేష్ పరిస్థితి విషమించడంతో సోమవారం మృతిచెందాడు. మృతుడి సోదరుడు సభావత్ రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిసిన నాయకులు

చిలుపూర్, ఏప్రిల్ 8 : మండలంలోని కృష్ణాజీగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం ఎమ్మెల్యే కడియం శ్రీహరితో పాటు, ఆయన కుమార్తె వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్నందజేశారు. కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా నాయకుడు సాదం గట్టయ్య నేతృత్వంలో పలువురు నాయకులు హన్మకొండలోని ఆయన నివాసానికి వెళ్ళారు. కార్యక్రమంలో ఊరడి యాదగిరి, దయాకర్, సాదం రాజు, ముక్కెర నరహరి, బుస్స శివ, కుమ్మరికుంట్ల రాజయ్య, మారపాక వెంకటయ్య, ఆశీర్వాదం, అమృతం, యాదగిరి పాల్గొన్నారు.

వనిత క్లబ్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు

జనగామ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వనిత క్లబ్ గ్రేటర్ జనగామ ఆధ్వర్యంలో సోమవారం ముందస్తు ఉగాది వేడుకలను జనగామలో నిర్వహించారు. వేడుకల్లో మహిళలు ఉగాది పచ్చడి, పులిహోర తదితర వంటకాలు తయారు చేశారు. ఈ సందర్భంగా 10 మందికి చీరలు, నిత్యావసరాలు అందించారు. వేడుకల్లో క్లబ్ అధ్యక్షురాలు మాదంశెట్టి వరూధిని, గంగిశెట్టి అనూజ పాల్గొన్నారు.



ఉగాది వేడుకల్లో పాల్గొన్న మహిళలు

రేషన్ బియ్యం పట్టివేత

జనగామ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం రాత్రి పట్టుకున్నారు. వివరాల్లోకెలితే.. జనగామ జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ నగర్‌లోని ఓ షెడ్డులో నిల్వ ఉన్న 75 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని లారీలో లోడ్ చేస్తున్న క్రమంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. పక్కా సమాచారం మేరకు దాడి చేసి లారీని స్వాధీనం చేశారు. ఈ ఘటనలో నల్లగొండ జిల్లాకు చెందిన లారీ డ్రైవర్ అంకూరి రామస్వామిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రఘుపతిరెడ్డి తెలిపారు.

క్రోధి సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): శ్రీ క్రోధి నామ త్రైత సిద్ధాంత తెలుగు సంవత్సర క్యాలెండర్‌ను జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి జనగామలోని ఆయన నివాస ంలో సోమవారం ఆవిష్కరించారు. త్రైత సిద్ధాంత ప్రబోధానంద సేవా సమితి జనగామ అధ్యక్షుడు శ్రీనాథ్ శ్రేష్ఠి, కార్యవర్గ సభ్యుడు ఉపేందర్ పాల్గొన్నారు. క్రోధి నామ సంవత్సర క్యాలెండర్‌ను విశ్వబ్రాహ్మణ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జనగామలోని ఆంజనేయస్వామి దేవాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో కొక్కొండ జగదీశ్వరాచార్యులు, మారోజు మల్లికార్జునాచార్యులు, నల్లనాగుల రాజు, పానుగంటి రామమూర్తి, పోత్కనూరి శ్రీధర్, ఆంజనేయచారి, కందుకూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలి

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



కడియం శ్రీహరికి బొకే ఇస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

జఫర్‌గఢ్, ఏప్రిల్ 8 : జరబోయే పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా వరంగల్ ఎంపీ స్థానంలో కాంగ్రెస్ గెలుపు కోసం ప్రతి కార్యకర్త అంకితబావంతో కృషి చేయాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. సోమవారం సాయంత్రం హన్మకొండలోని కడియం నివాసంలో జఫర్‌గఢ్ మండలం రేగడితండా, టీబీ తండా, కజానగండితండాలకు చెందిన సుమారు వంద మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరగా ఎమ్మెల్యే వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కడియంను గిరిజన నాయకులు శాలువాలు, పూలమాలతో సత్కరించారు. కడియం శ్రీహరి మాట్లాడుతూ వరంగల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ కావ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందన్నారు. సంక్షేమ పాలనకు స్పందించి అనేక మంది ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. ప్రతీ కార్యకర్తలకు పార్టీ అండగా నిలుస్తుందన్నారు. రానున్న పార్లమెంటు పార్టీ విజయమే లక్ష్యంగా కలిసికట్టుగా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నేతలు బానోత్ రాజేశ్‌నాయక్, కోనాయిచలం ఎంపీటీసీ దేవెందర్‌నాయక్, మాజీ సర్పంచ్ జగ్యానాయక్, భూక్య రవినాయక్, పవన్‌కుమార్, తదితర గిరిజననాయకులు పాల్గొన్నారు.

ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగేలా చూడాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో ధరంసోత్ వెంకన్న నాయక్

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 8 : త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగేలా చూడాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో ధరంసోత్ వెంకన్న నాయక్ అధికారులను ఆదేశించారు. సోమ వారం డివిజన్ కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని తహసీల్దార్లతో ఎస్‌వీఈఈపీ (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోరల్ పార్టిసిపేషన్) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు, సలహాలు చేశారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన అన్ని జాగ్రత్తలు, చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వేసవి కారణంగా మండుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని ప్రజల సౌకర్యార్థం తాగునీటిని అందిస్తున్న తహసీల్దార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశంలో తహసీల్దార్లు ఎం. సరస్వతి, వెంకటేశ్వర్లు, డీటీలు విమల, విజయ్‌కుమార్, బాసెట్టి హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్ర



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం ఎంపీ అభ్యర్థి జహంగీర్

జనగామ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని భువనగిరి సీపీఎం అభ్యర్థి ఎండి.జహంగీర్ విమర్శించారు. జనగామలోని సీపీఎం కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో అత్యంత క్లిష్టమైన పరిస్థితుల ఉన్న సమయంలో పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్నా యన్నారు. రాజ్యాంగాన్ని మార్చి దాని స్థానంలో మనుధర్మాన్ని తీసుకురావాలనే ఆలోచనలో బీజేపీ ఉందన్నారు. దీని ద్వారా దేశంలో కుల, మత, ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టాలని చూస్తోందన్నారు. ఆర్ఎస్ఎస్ ఆలోచనలకు అడ్డుగా ఉన్న రాజ్యాంగాన్ని తొలగించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు. సీఏఏ రద్దు, జ్యోతిష్యశాస్త్రం అమలు, విద్యా కాశాయీకరణ వంటి వాటిని బీజేపీ బలవంతంగా అమలు చేస్తోందన్నారు. నల్లధనం బయటకు తీసి ఒక్కొక్కరి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తానని చెప్పి బీజేపీ మోసం చేసిందన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక అవినీతికి చట్టబద్ధత కల్పించిందన్నారు. ఎలక్ట్రోరల్ బాండ్స్ రూపంలో బీజేపీకి రూ. 800 కోట్లు చేరాయన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ప్రజలు చిత్తుగా ఓడించాలన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, నాయకులు రాపర్తిరాజు, ఇర్రి అహల్య, బూడిద గోపి, జోగు ప్రకాశ్, సుంచు విజేందర్, బొట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● బచ్చన్నపేట : ప్రశ్నించే గొంతుకు పట్టం కట్టినప్పుడే ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయని సీపీఎం భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి ఎండీ జహంగీర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో జిల్లా కమిటీ సభ్యులు సుంచు విజేందర్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సమైఖ్యతను, సమగ్రతను బీజేపీ ప్రభుత్వం దెబ్బతీస్తోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారని, ప్రజల మధ్య ఐక్యతను దెబ్బతీసే కుట్రలు జరుగుతున్నాయన్నారు. ఎదురించి ప్రశ్నించిన వారిపై కేసులు పెడుతూ జైళ్లల్లో నిర్బంధిస్తు న్నారని మండిపడ్డారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, రామగళ్ల అశోక్, అన్నెబోయిన రాజు, పర్వతం నర్సింహా లు, తాడెం రాములు, కడకంచి బాల్‌రాజు, శోభ, పోచయ్య పాల్గొన్నారు.

దాత సహకారం అభినందనీయం

- ఛాగల్లులో వాటర్ ప్లాంట్ ప్రారంభం



కార్యక్రమంలో మాట్లాడుతున్న జవహర్‌రెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 8 : గ్రామ ప్రజలకు సురక్షితమైన తాగునీరందించేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, రూ 1. 60 లక్షలను అందజేసి వాటర్ ప్లాంట్ ప్రారంభానికి ప్రత్యక్షంగా సహకరించిన ఇనుగాల చిత్తరంజన్‌రెడ్డి సేవలు అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, మాజీ సర్పంచ్ జవహర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు గ్రామస్థుల సమక్షంలో సోమవారం వాటర్ ప్లాంటును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జవహర్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామాభివృద్ధిలో భాగంగా వాటర్ ప్లాంట్ నిర్మాణం కోసం పదేళ్ళ క్రితం అప్పటి ఎంపీ, ప్రస్తుత స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి రూ 5 లక్షలు మంజూరు చేశారని, పనులు పూర్తయినప్పటికీ అనివార్య కారణాల వల్ల ప్రారంభం కాలేదన్నారు. కాగా, ప్లాంటు పునరుద్ధరణ కోసం గ్రామానికి చెందిన దాత ఇనుగాల చిత్తరంజన్‌రెడ్డి ముందుకు రావడం శుభపరిణామమన్నారు. కుందూరు వెంకట్‌రెడ్డి, గద్దె అనిల్‌కుమార్, ఇనుగాల నరసింహారెడ్డి, కనకం రమేష్, మల్లిఖార్జున్ పాల్గొన్నారు.

మండలంలో కలెక్టర్ ఆకస్మిక పర్యటన



రైల్వే స్టేషన్ వెనుక కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

రఘునాథపల్లి, ఏప్రిల్ 8: మండల కేంద్రంతో పాటు మండలంలోని కోమల్ల గ్రామంలో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా సోమవారం సాయంత్రం ఆకస్మికంగా పర్యటించారు. మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ వెనుక కాలనీలోగల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా గుర్తించిన పనులను పరిశీలించారు. పాఠశాలలో తాగునీరు, విద్యుత్ టాయిలెట్స్, కాంపౌండ్ వాల్ తదితర మౌలిక సదుపాయల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులను 15 రోజులలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే మండలంలోని కోమల్ల గ్రామ పంచాయతీ పరిధిలో ఎస్డీఎఫ్ కింద జరుగుతున్న మిషన్ భగీరథ పైప్ లైన్ పనులను పరిశీలించి, త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఎండా కాలంలో తాగు నీటికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సమ్మర్ యాక్షన్ ప్లాన్ ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో అనిల్ కుమార్, డిఈవో రాము, ఎంపిడివో శ్రీనివాసులు, డిపివో వెంకటేశ్వరు పాల్గొన్నారు.